## కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అల**

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): పాల్వంచ పట్టణంలోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలు భద్రపర్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. శుక్రవారం ఆమె స్ట్రాంగ్ రూంను పరిశీలించి భద్రతా సిబ్బంది, సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. ఆదివారం జరిగే కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని అన్నారు. కౌంటింగ్ పర్యవేక్షణకు 18 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక సూక్ష్మ పరిశీలకుడు, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లు కేటాయించామన్నారు. లెక్కింపు పరిశీలకులు కమల్ కిశోర్, హరికిశోర్, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, రాంబాబు, కార్తీక్, శిరీష, మంగీలాల్, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా ఉన్నారు.

## మావోయిస్టుల విధ్వంసకర ప్లాన్ భగ్నం

**ల్యాండ్ మైన్ కుట్రను భగ్నం చేసిన పోలీసులు**



ల్యాండ్‌మైన్ బ్లాస్టింగ్ దృశ్యం..

కొత్తగూడెం క్రైం/ చర్ల, డిసెంబర్ 1: పీఎల్‌జీఏ 23వ వార్షికోత్సవ వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు పోలీస్ బలగాలను టార్గెట్ చేశారు. వారి ప్లాన్‌ను భగ్నం చేస్తూ భద్రాద్రి జిల్లా పోలీసులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో అమర్చిన 40 కిలోల ల్యాండ్ మైన్‌ను నిర్వీర్యం చేశారు. ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులను టార్గెట్ చేస్తూ చర్ల మండల పరిధిలోని పెద్దబీడిసిలేరు అటవీ ప్రాంతానికి వెళ్లే రహదారిలో 40 కిలోల ల్యాండ్ మైన్‌ను అమర్చారు. విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందుకున్న పోలీస్‌శాఖ బాంబ్ స్క్వాడ్ సహకారంతో గురువారం సాయంత్రం ల్యాండ్‌మైన్ గుర్తించారు. శుక్రవారం ల్యాండ్‌మైన్‌ను నిర్మానుష్య ప్రాంతానికి తరలించి బ్లాస్ట్ చేసి పెనుముప్పును తప్పించారు. ఎన్నికల విధులకు హాజరై తిరిగి వెళ్లే బలగాలను టార్గెట్ చేస్తూ ఈ ల్యాండ్‌మైన్ పెట్టారని ఎస్పీ స్పష్టం చేశారు.

**శెభాష్.. ఆదివాసీలు..!**

మావోయిస్టులు ఆదివాసీలను ఓటు వేయకుండా ఉండేందుకు అనేక విధాలుగా బెదిరించారని, అయినప్పటికీ 90శాతం ఆదివాసీలు పోలీస్ శాఖపై ఉన్న నమ్మకంతో ఓటు వేసి తమ చైతన్యాన్ని చాటారని ఎస్పీ కొనియాడారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన సీఆర్పీఎఫ్ బలగాలను ఆయన అభినందించారు.

## ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 1 తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు గడువు పొడగించినట్లు డీఈవో సోమశేఖరశర్మ, కో-ఆర్డినేటర్ మద్దినేని పాపారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 11లోపు ఆన్‌లైన్ ద్వారా లేదా అభ్యాసన కేంద్రాల్లో సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 80084 03522లో సంప్రదించాలని సూచించారు.

## గొంతులోని స్ప్రింగ్ తొలగింపు

ఖమ్మం సిటీ, డిసెంబర్ 1: సత్తుపల్లి పట్టణానికి చెందిన ప్రేమ్‌కుమార్ అనే తొమ్మిదేండ్ల బాలుడు శుక్రవారం బొమ్మ తుపాకీతో ఆడుకుంటుండగా స్ప్రింగ్ గొంతులోపలికి వెళ్లింది. దీంతో బాలుడు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు. బాలుడు తల్లిదండ్రులు వెంటనే ఖమ్మంలోని సాయిరాం గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. వైద్యుడు జంగాల సునీల్‌కుమార్ ఎంతో శ్రమకోర్చి పిడియాట్రిక్ ఎండోస్కోపి పరికరాన్ని ఉపయోగించి గొంతులో ఇరుక్కుపోయిన స్ప్రింగ్‌ను తొలగించారు.



డాక్టర్ సునీల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలుడు



## భళా.. మహిళాశక్తి !

**ఖమ్మం జిల్లాలో అత్యధిక ఓటింగ్ అతివలదే..**

ఖమ్మం, డిసెంబర్ 1: జిల్లా పరిధిలోని నియోజకవర్గాల పరిధిలో గురువారం జరిగిన పోలింగ్‌లో అతివలదే పైచేయి. జిల్లావ్యాప్తంగా 12.16 లక్షల మంది ఓటర్లు ఉండగా వీరిలో 10.20 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పురుష ఓటర్లు 5,89,165 మంది ఉండగా వీరిలో 4,95,953 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మొత్తం మహిళా ఓటర్లు 6,27,553 మంది ఉండగా వీరిలో 5,24,093 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుష ఓటర్ల కంటే 28,140 మంది మహిళలు ఎక్కువగా ఓటు వేశారు. జిల్లావ్యాప్తంగా 1,96,709 మంది ఓటర్లు అసలు ఓటే వేయలేదు. ఇతర ఓటర్లు 78 మంది ఉండగా వీరిలో 41 మంది ఓటు వేశారు.

# నవంబర్‌లో 82 శాతం బొగ్గు ఉత్పత్తి



కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 1: సింగరేణీయులు నవంబర్ నెలలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 82 శాతాన్ని సాధించారు. ఈనెలలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పలు రాజకీయ పార్టీలకు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో కాస్త ఉత్పత్తి శాతం తగ్గింది. సంస్థ 11 ఏరియాల పరిధిలో 74,41,900 టన్నుల లక్ష్యానికి 60,83,750 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఎన్నికల నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి శాతం కాస్త తగ్గినప్పటికీ డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి లోపు 100 శాతం లక్ష్యాన్ని సాధించేదిశగా సింగరేణీయులు పనిచేస్తున్నారు.

**ఏరియాల వారీగా ఉత్పత్తి ఇలా..**

కొత్తగూడెం ఏరియా 15,18,500 టన్నుల లక్ష్యానికి 10,95,872 టన్నులు (72 శాతం), ఇల్లెందు ఏరియా 4 లక్షల టన్నులకు 4,00,200 టన్నులు (100 శాతం), మణుగూరు ఏరియా 10,68,500 టన్నులకు 11,44,887 టన్నులు (107 శాతం), బెల్లంపల్లి ఏరియా 2,50,000 టన్నులకు 3,26,831 టన్నులు (131 శాతం), మందమర్రి ఏరియా 4,33,000 టన్నులకు 3,70,495 టన్నులు (86 శాతం), ఎస్ఆర్‌పీ ఏరియా 6,27,500 టన్నులకు 4,90,506 టన్నులు (78 శాతం), ఆర్జీ-1 ఏరియా 4,02,300 టన్నులకు 3,76,781 టన్నులు (94 శాతం), ఆర్జీ-2 ఏరియా 8,79,000 టన్నులకు 9,04,303 టన్నులు (103 శాతం), ఆర్జీ-3 ఏరియా 4,70,000 టన్నులకు 4,80,905 టన్నులు (102 శాతం), ఆండ్రియాలా ప్రాజెక్టు 1,43,100 టన్నులకు 1,88,313 టన్నులు (131 శాతం), భూపాలపల్లి ఏరియా 4,50,000 టన్నులకు 3,04,657 టన్నుల (68 శాతం) బొగ్గు ఉత్పత్తి సాధించాయి.



మాలధారణ చేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

**భద్రాద్రి రామయ్య సన్నిధిలో**

## కార్తీక పునర్వసు దీక్షలు ప్రారంభం

భద్రాచలం, డిసెంబర్ 1: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు కార్తీక పునర్వసు దీక్షలు ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకుడు అమరవాది విజయరాఘవన్ ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీక్ష తీసుకుంటున్న వారి మెడలో తులసి మాలలు వేశారు. ఈ నెల 28న దీక్షా విరమణ ఉంటుందని, ఇదే రోజు గిరి ప్రదక్షిణ, పాదుకాపూజ, వెండి రథోత్సవం, 29న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. 15 ఏళ్ల నుంచి ఆలయ పరిధిలో పునర్వసు దీక్షలు ప్రారంభించామని, దీక్షాకాలం 27 రోజులు ఉంటుందన్నారు. శ్రీరామనవమి రోజు సాయంత్రం మొదటి శ్రీరామ పునర్వసు దీక్షలు ప్రారంభమవుతాయని, తిరిగి కార్తీక మాసంలో వచ్చే పునర్వసు నక్షత్రం రోజున మరోసారి కార్తీక పునర్వసు దీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

## హెచ్ఐవీ బాధితులు ఆయుర్దాయం పెంచుకోవచ్చు



ఎయిడ్స్ దినోత్సవంలో వైద్యులు, సిబ్బంది

ఖమ్మం సిటీ, డిసెంబర్ 1: హెచ్ఐవీ బాధితులు వైద్యుల సూచనలు పాటిస్తూ, పోషకాహారం తీసుకుంటూ ఆయుర్దాయం పెంచుకోవచ్చని ఖమ్మం ప్రధానసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో కలిసి నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాధితులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్.ప్రవీణ మాట్లాడుతూ.. హెచ్ఐవీ బాధితులు ప్రతిరోజూ వ్యాయామం చేయాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలని, వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ హెచ్ఐవీ టెస్ట్ చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ బీ వెంకటేశ్వర్లు, ఆర్ఎంవోలు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధితులు ఏఆర్టీ సిబ్బందిని సంప్రదించి వారి సలహాలు సూచనలు పాటించాలన్నారు. అనంతరం డీఏపీసీయూ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన ఐసీటీసీ ఖమ్మం, సత్తుపల్లి, మధిర, ఏఆర్టీ ఖమ్మం, జనవాణి, జాగృతి, అప్పా ప్లస్, సీఎఫ్ఐ లింకు వర్కర్స్, క్రిస్టియన్ సర్వీసెస్ యూనిట్, సత్యసాయి సేవా సమితి వంటి సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణ, నర్సులు పాల్గొన్నారు.

## అమలులోకి నూతన మద్యం పాలసీ

**జిల్లాలో 122 మద్యం దుకాణాలు షురూ**

మామిళ్లగూడెం, డిసెంబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ అమలులో భాగంగా ఆగస్టు 21న లాటరీ పద్ధతిన ఎంపికలు జరిగాయి. లాటరీలో టెండర్లు దక్కించుకున్న 122 మంది శుక్రవారం జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలు తెరిచారు. రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, గౌడ సామాజిక వర్గాలూ దుకాణాలు దక్కించుకున్నాయి. దుకాణ యజమానులు వైరా మద్యం డిపో నుంచి స్టాకు తీసుకువచ్చారని డీఈఎస్ నాగేంద్రరెడ్డి తెలిపారు. ఎంఆర్పీ ప్రకారమే దుకణాదారులు మద్యం విక్రయించాలని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన మద్యం పాలసీ 2023- 25 వరకు కొనసాగుతుందన్నారు.

